విశాఖ బీచ్‌రోడ్డులో భారీ అగ్నిప్రమాదం
డైనో పార్కులో ఆకస్మికంగా ఎగసిపడిన మంటలు
- క్షణాల్లో పార్కు మొత్తం బూడిద
- పిల్లలు ఆడుకునే వస్తువులన్నీ ఫైబర్, ప్లాస్టిక్‌తో చేసినవి కావడంతో పెరిగిన తీవ్రత
- సందర్శకులతో పాటు నివాసితుల్లో భయాందోళన
మెయిన్‌లో...

శకటాల బిల్లులూ రాకపాయె

వరుసగా రెండేళ్లు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం

- అప్పులు చేసి తయారు చేయించిన అధికారులు గగ్గోలు
- రెండేళ్ల బకాయి రూ.50 లక్షలు
- కూటమి ప్రభుత్వంలో అందుతాయని ఆశలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకే కాదు ప్రభుత్వ శాఖలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా చెల్లించలేదు. ప్రైవేటు కాంట్రాక్టర్లు బిల్లులు అందకపోతే పనులకు టెండర్లు వేయకుండా తప్పుకుంటారు. కానీ ప్రభుత్వ శాఖల అధికారుల పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం దిగువస్థాయి ఉద్యోగులు నిధులున్నా, లేకపోయినా అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు తయారు చేయించిన శకటాలకు రెండేళ్లుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో అప్పులు చేసి శకటాలను తయారు చేయించిన అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.


గతంలో బిల్లులు అందని ప్రగతి రథం (ఫైల్)

జాతీయ పండగలైన స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని కళ్లకు కట్టినట్టు ప్రజలకు తెలిపేందుకు ఆయా శాఖల ద్వారా ప్రగతి రథాలను (శకటాలను) ప్రదర్శిస్తుంటారు. 2022 ఏప్రిల్ 4న అనకాపల్లి జిల్లా ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు స్వాతంత్ర్య గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శనకు తయారు చేయించిన శకటాలకు గత వైసీపీ ప్రభుత్వం ఆయా శాఖలకు బిల్లులు చెల్లించలేదు. ఈ రెండేళ్లలో జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన 22 ప్రగతి శకటాలను అధికారులు ఆయా జాతీయ పర్వదినాల్లో ప్రదర్శించారు. శకటం తయారీకి ఒక భారీ వాహనాన్ని అద్దెకు తీసుకుని ప్రదర్శన కోసం పలు రకాల వస్తువులు కొనుగోలు చేశారు. ఒక్కో శకటం తయారీకి రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలు ఖర్చయ్యాయి. ఈ రెండేళ్లకు శకటం తయారీకి రూ.50 లక్షలు కావడంతో ప్రభుత్వ శాఖల అధికారులు బిల్లులను కలెక్టర్ ఆమోదం తరువాత సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఆయా బిల్లులకు సంబంధించి సబ్ ట్రెజరీల నుంచి టోకెన్ నంబర్లు జారీ అయినా చెల్లింపులు మాత్రం జరగలేదు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం ప్రభుత్వాలు కొంత మొత్తం కేటాయింపులు జరిపేవి. అంతే కాకుండా స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రభుత్వ శాఖలకు అయ్యే ఖర్చుకు సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేసేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం జిల్లా ఏర్పడిన తరువాత ఇంత వరకు వీటి బిల్లులు చెల్లించలేదు. దీంతో పలు శాఖల్లో ముఖ్య అధికారి ఆదేశాల మేరకు అప్పులు చేసి సొంత పూచీకత్తుపై శకటాలు రూపొందించేందుకు పెట్టుబడులు పెట్టిన ఆయా శాఖల్లోని కార్యాలయాల సెక్షన్ సూపరింటెండెంట్లు బిల్లులు ఎప్పుడు వస్తాయా? అని ఎదురు చూస్తున్నారు. కొన్ని కార్యాలయాల సిబ్బంది అయితే శకటాల తయారీ కాంట్రాక్టర్లకు సొంత పూచీకత్తుపై పనులు అప్పగించి బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

ఈసారి శకటాలు లేనట్టే..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రగతి శకటాలను ప్రదర్శించడం లేదు. శకటాల తయారీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ప్రభుత్వ శాఖల అధికారులు ఈ ఏడాది శకటాలను తయారు చేయించడం లేదు. కాగా వైసీపీ పాలనలో నిలిచిపోయిన శకటాల తయారీ బిల్లులను కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బిందు సేద్యానికి ఊపిరి

- రైతుల ఆనందం
- వైసీపీ పాలనలో ఐదేళ్లుగా పడకేసిన పథకం
- డీడీలు కట్టిన అన్నదాతలకు పరికరాలు సరఫరా చేయని కంపెనీలు
- నిర్లక్ష్యానికి గురైన మెట్ట, ఉద్యాన పంటల సాగు

డ్రిప్ ఇరిగేషన్‌కు కూటమి ప్రభుత్వం చేయూత

చోడవరం, ఆగస్టు 13:

గ్రామీణ ప్రాంతంలో మెట్ట ఉద్యాన పంటల రైతులకు ఊరట లభించింది. ఐదేళ్ల వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన డ్రిప్ ఇరిగేషన్ సాగుకు కూటమి ప్రభుత్వం చేయూత ఇచ్చే చర్యలు చేపట్టింది. డ్రిప్ సౌకర్యం కావలసిన రైతులు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారులు సూచించారు. దీంతో గ్రామాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం పొందేందుకు సన్నద్ధమవుతున్నారు.


డ్రిప్ ఇరిగేషన్ యూనిట్

జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్‌కు పాత కంపెనీలతో పాటు మరికొన్ని కొత్త కంపెనీలు కూడా రైతులకు పరికరాలు ఇచ్చేందుకు సన్నద్ధమైనట్టు సమాచారం. గత వైసీపీ పాలనలో డ్రిప్ ఇరిగేషన్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో జిల్లాలో పూర్తిగా డ్రిప్ ఇరిగేషన్ పడకేసిన సంగతి తెలిసిందే. మెట్ట ప్రాంతాల్లోని సన్న, చిన్నకారు రైతులు, ఎక్కువ విస్తీర్ణంలో మామిడి, కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు పండించే రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈ డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం నిలిచిపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. గతంలో పథకం కోసం దరఖాస్తు చేసిన రైతులకు పరికరాలు ఇవ్వడానికి కంపెనీలు నిరాకరించడం, కట్టిన డీడీ డబ్బులు వెనక్కిరాని పరిస్థితుల్లో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అన్నదాత దరఖాస్తు చేసిన వెంటనే అధికారులు సర్వే చేసి నెలరోజుల్లోగా పొలంలో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించేవారు.

ఐదేళ్లలో అంతా తారుమారు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డ్రిప్ ఇరిగేషన్ పథకం విషయంలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తిగా నిర్వీర్యం అయిపోయింది. ఈ పథకం కోసం దరఖాస్తు చేసి డీడీలు కట్టిన రైతులకు పరికరాలు ఏర్పాటు చేయలేదు సరికదా డ్రిప్ సౌకర్యం ఎప్పుడు కల్పిస్తారనేది కూడా స్పష్టంగా చెప్పలేదు. దీంతో రైతులు నిరాశ చెందారు. డ్రిప్ ఇరిగేషన్ కంపెనీలకు చెల్లించవలసిన బకాయిలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో కంపెనీలు రైతులకు పరికరాల సరఫరాను నిలిపివేశాయి. ఫలితంగా ఐదేళ్లలో గ్రామాల్లో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ అందుబాటులో లేకుండాపోయింది. ఫలితంగా గ్రామాల్లో ఉద్యానసాగు, ఇతర పంటలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయి.

దరఖాస్తు చేస్తే డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం

డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరాం. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. దరఖాస్తు చేసిన రైతులందరి పొలాల్లో సర్వే చేయనున్నాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సెప్టెంబరు నెలాఖరుకల్లా డీడీలుకట్టిన రైతులందరికీ డ్రిప్ ఇరిగేషన్ మెటీరియల్ అందుబాటులో ఉంటుంది.

\- జీవీ లక్ష్మి, పీడీ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు

ఇది నిజంగా వరం



డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు పథకం కింద సౌకర్యం కల్పిస్తామని సిబ్బంది చెబుతున్నారు. దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మాకు ఇది నిజంగా వరంగా భావిస్తున్నాం.

\- సిరిగిరిశెట్టి వెంకటరమణ, దిబ్బిడి, బుచ్చెయ్యపేట మండలం

చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నా..



డ్రిప్ ఇరిగేషన్ కింద కూరగాయల సాగు చేయాలని చాలా కాలంగా ఎదురు చూస్తున్నా. డ్రిప్ సౌకర్యం ఎప్పుడు వస్తుందా? అని వేచి ఉన్నా. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం వస్తే కూరగాయల సాగుతో పాటు ఇతర పంటలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

\- కేమిశెట్టి శ్రీనివాస్, రైతు, దిబ్బూరు, మాడుగుల మండలం



విశాఖలో విక్రమ్ సందడి

ప్రముఖ కథానాయకుడు విక్రమ్, హీరోయిన్ మాళవిక మంగళవారం విశాఖలో సందడి చేశారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తనకు క్లిష్టమైన పాత్రలు చేయడమంటే ఎంతో ఇష్టమని విక్రమ్ తెలిపారు.

\- వివరాలు 7వ పేజీలో..

ఆర్వో ప్లాంట్‌కు మోక్షం

స్వాతంత్ర్య దినోత్సవం నాడు పునఃప్రారంభానికి ఏర్పాట్లు

- గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఎన్టీఆర్ సుజల పథకం
- కూటమి ప్రభుత్వంలో కదలిక

చోడవరం, ఆగస్టు 13:

స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందించే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఎన్టీఆర్ సుజల పథకం మళ్లీ ప్రారంభం కానుంది. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సమీపంలోని పార్కు వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సమీపంలోని పార్కు వద్ద గల ఆర్వో ప్లాంట్


వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

టీడీపీ హయాంలో సామాన్యులకు మినరల్ వాటర్ పంపిణీ కోసం పట్టణంలోని స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి, లక్ష్మీపురం రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఈ ఆర్వో ప్లాంట్ల నుంచి కేవలం ఒక్క రూపాయి చెల్లించి క్యాన్లలో స్వచ్ఛమైన మంచినీరు తీసుకు వెళ్లేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆర్వో ప్లాంట్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో మినరల్ వాటర్ సరఫరా నిలిచిపోయింది. ఒక్క రూపాయికే మినరల్ వాటర్ తీసుకు వెళ్లే స్థానికులు అప్పటి నుంచి బాటిల్‌కు పది రూపాయలు చెల్లించి ప్రైవేటు ఆర్వోప్లాంట్ల వద్ద నీటిని కొనుక్కుంటున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆర్వో ప్లాంట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని ఆదేశించడంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీ అధికారులకు ఆర్వోప్లాంట్లను పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సమీపంలోని పార్కు వద్ద ఉన్న ఆర్వో ప్లాంటు మెషినరీని బాగు చేసి, పాడైన మోటార్లకు మరమ్మతులు చేసి వినియోగానికి సిద్ధం చేశారు. ఈ ఆర్వో ప్లాంటును ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పునఃప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో ఆర్వో ప్లాంట్‌ను కూడా త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకమ్మ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

రాజకీయ విలువలకు కట్టుబడే!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా కూటమి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

రాజకీయ విలువలకు కట్టుబడే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి ఎవరినీ బరిలోకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి భారీ మెజారిటీని కట్టబెట్టారని, జిల్లాలోనే ముగ్గురు అభ్యర్థులు అత్యధిక మెజారిటీ సాధించారన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందన్నారు. రెండేళ్ల క్రితం ఈ ఎన్నిక జరిగినపుడు ప్రతి పక్ష పార్టీల నుంచి ఎవరూ బరిలో దిగకుండా, నామినేషన్లు వేయకుండా వైసీపీ భయాందోళనలకు గురిచేసిందన్నారు. అయితే అలాంటి రాజకీయాలు చేయడం సరైన విధానం కాదని అధిష్ఠానం భావించడంతో పోటీకి దూరమయ్యామన్నారు. వైసీపీకి చెందిన అనేక మంది నాయకులు కూటమిలో చేరుతామని, ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలిపితే మద్దతు ఇస్తామని ముందుకు వచ్చారన్నారు. అయితే వారిని పార్టీలోకి ... మిగతా 8వ పేజీలో

అసంపూర్తిగా ఐసీడీఎస్ కార్యాలయం

- రూ.58 లక్షలతో పనులకు శ్రీకారం
- 2021లో పనులు పూర్తి కాకుండానే ప్రారంభం
- తర్వాత నిలిచిపోయిన పనులు
- ఆ భవనంలోనే కార్యాలయం నిర్వహణ

\- వార్త 7వ పేజీలో..

రంగురాళ్ల తవ్వకాలపై ఆరా

రిజర్వు ఫారెస్ట్‌లో తవ్వకాలు జరిగాయన్న సమాచారంతో పోలీసులు, అటవీ సిబ్బంది అప్రమత్తం

గొలుగొండ, ఆగస్టు 13:

సాలికమల్లవరం రిజర్వు ఫారెస్ట్‌లో గుట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు జరిగాయన్న సమాచారం పోలీసులు, అటవీ సిబ్బందికి అందడంతో మంగళవారం ఎస్ఐ కృష్ణారావు, నర్సీపట్నం అటవీ సెక్షన్ రేంజర్ లక్ష్మీనర్సు సిబ్బందితో పరిశీలించారు. మండలంలోని సాలికమల్లవరం గ్రామంలో గల రిజర్వు ఫారెస్ట్‌లో పాత రంగురాళ్ల క్వారీల వద్ద గల కొండపై గుట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు జరిగాయన్న సమాచారంతో పొగచెట్లపాలెం, సాలికమల్లవరం, వెంకటాపురం గ్రామాల్లో గల అటవీ ఫారెస్ట్ భూముల్లో చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. అయితే తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పోలీసులు, అటవీ సిబ్బంది గుర్తించలేదు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ రంగురాళ్ల తవ్వకాలకు ప్రోత్సహించినా, తవ్వకాలు జరిపినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


సాలికమల్లవరం రిజర్వు ఫారెస్ట్‌లో రంగురాళ్ల తవ్వకాలపై ఆరా తీస్తున్న పోలీసులు, అటవీ సిబ్బంది

క్రైం... crime news

చాకుతో దాడి చేసిన వార్డు మెంబర్‌పై కేసు నమోదు

కొత్తూరు, ఆగస్టు 13: ఓ వ్యక్తిపై చాకుతో దాడి చేసిన వార్డు మెంబర్‌పై కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు మంగళవారం తెలిపారు. అనకాపల్లి మండలం బవులవాడ రిక్షా కాలనీకి చెందిన ఇద్దరు యువకుల మధ్య గొడవ జరిగింది. అయితే గ్రామ పెద్ద మనిషిగా వార్డు మెంబర్ ఈపు యేసు వెళ్లగా ఆయనపై కూడా తిరగబడ్డారు. ఈ విధంగా వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి చాకుతో గొర్లి శివపై యేసు దాడి చేశారు. ఈ దాడిలో శివ చెవికి తీవ్రంగా గాయమైంది. ఈ సంఘటనపై శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యేసుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

బెల్టు షాపులపై దాడి



మద్యం బాటిళ్లతో మునగపాక ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక(తుమ్మపాల), ఆగస్టు 13: మండలంలోని మునగపాకలో మద్యం బెల్టు షాపులపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

» ఒకరిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నుంచి మంగళవారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. లంకెలపాలెం సమీపంలోని గొల్లపేటకు చెందిన బర్ల అప్పారావు పట్టణంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళ్లేందుకు సుంకరమెట్ట జంక్షన్‌లో ఉండగా అనుమానం వచ్చి పోలీసులు తనిఖీ చేశారు. 12 మద్యం బాటిళ్లు బయట పడడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కేజీబీవీలో వసతుల పరిశీలన

ఆకస్మికంగా తనిఖీ చేసిన సివిల్ కోర్టు జడ్జి



విద్యార్థినులకు తయారు చేసిన వంటలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కోటవురట్ల, ఆగస్టు 13: కోటవురట్ల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని నర్సీపట్నం సబ్ కోర్టు సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయన నర్సీపట్నం మండలం వేములపూడి, కోటవురట్ల కేజీబీవీ ల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనం నాణ్యతను, డైనింగ్‌హాలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం లైబ్రరీని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడిన పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన విచారణ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తారు. ఆయన వెంట కోటవురట్ల ఎస్‌ఐ రమణయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సరితాదేవి, తదితరులు వున్నారు.

సమస్యలు పరిష్కరించండి

» కమిషనర్‌కు మునిసిపల్ కార్మికుల వినతి



కమిషనర్ ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మిక సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 13 : ఎలమంచిలి మునిసిపాలిటీలో నెలలు తరబడి ఉన్న మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ ప్రభాకరరావుకు మంగళవారం కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు ఆధ్వర్యంలో హోంమంత్రిని కలిసిన కార్మిక ప్రతినిధులు వారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఏసుదాసు విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడిన సబ్బులు, నూనెలు, వర్షాకాలం కోటులు, ఏప్రాన్‌లు, బట్టలు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఏళ్లతరబడి ఉన్న పుష్‌కాట్స్ పాడయ్యాయని, కొత్తవి అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వై.నూకరాజు, సీహెచ్ వెంకటరమణ, డి.మహేష్, జి.రవి పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన



సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 13: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మంగళవారం చినముసిడివాడలో నూతనంగా నిర్మిస్తున్న రెండంతస్థుల కల్యాణ మండపాన్ని పరిశీలించారు. సంస్థకు ఆదాయం పెంచేలా నిర్వహణా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్బవరం నుంచి గుల్లేపల్లి వరకు రూ.5.71 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను తిలకించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చే పనులనువేగవంతం చేయాలన్నారు. అడ్డూరు, పైడివాడ అగ్రహారం, కోడూరు 1,2,3,4, లే అవుట్‌లలో మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా అనకాపల్లి రావుగోపాలరావు కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతులను, తుమ్మపాలలో సంస్థకు చెందిన భూములు పరిశీలించారు. ఆ తర్వాత అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్‌సీ లేఅవుట్లపై చర్చించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

అసంపూర్తిగా ఐసీడీఎస్ కార్యాలయం

రూ. 58 లక్షలతో పనులకు శ్రీకారం

- 2021లో పనులు పూర్తి కాకుండానే ప్రారంభం
- తర్వాత నిలిచిపోయిన పనులు
- కాంట్రాక్టర్‌కు రూ.12 లక్షల బకాయిలు
- మీటింగ్ హాల్, కార్యాలయం కిటికీ రెక్కలు, మరుగుదొడ్లు డోర్లు అమర్చని వైనం
- ఆ భవనంలోనే కార్యాలయం నిర్వహణ



నర్సీపట్నం ఐసీడీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, ఆగస్టు 13:

సమగ్ర మహిళ, శిశు సంక్షేమ (ఐసీడీఎస్) కార్యాలయ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు కాకుండానే భవనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవనంలోనే ఐసీడీఎస్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

నర్సీపట్నం పట్టణంలోని తురకబడి సమీపంలో కొత్తవీధి రోడ్డులో ఒక అద్దె ఇంట్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఉండేది. అక్కడ సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బంది పడేవారు. ఇంటి యజమాని సైతం భవనం ఖాళీ చేయాలని తరచూ ఒత్తిడి చేసేవారు. ఇక్కడ పరిస్థితిని స్థానిక సీడీపీవో ఉన్నతాధికారులకు వివరించడంతో నూతన కార్యాలయ భవన నిర్మాణానికి 2017-18వ సంవత్సరంలో రూ.58 లక్షలు మంజూరు చేశారు. ఇందుకోసం నర్సీపట్నం- కోటవురట్ల రోడ్డులో స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ కార్యాలయ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆఫీసు, గోదాము, మొదటి అంతస్తులో మీటింగ్ హాల్ నిర్మాణ పనులు చేశారు. ఇంకా పనులు జరుగుతుండగానే అద్దె భవనం యజమాని ఖాళీ చేయాలని తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్‌తో మాట్లాడడంతో నిర్మాణంలో ఉన్న భవనాన్ని 2021లో ఆయన ప్రారంభించారు. తర్వాత అద్దె భవనం నుంచి కార్యాలయాన్ని అసంపూర్తి భవనంలోకి మార్చారు. అయితే అప్పటి వరకు జరిగిన పనులకు రూ.22 లక్షలను కాంట్రాక్టర్ ఖర్చు చేయగా.. రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. దీంతో కిటికీ రెక్కలు, మరుగుదొడ్లు డోర్లు, ఫ్లంబింగ్ పనులు, రంగులు వేయలేదు. మొదటి అంతస్తులో మీటింగ్ హాల్, ప్రహరీ గోడ పనులు చేపట్టాల్సి ఉంది. కిటికీ రెక్కలు లేకపోవడంతో రోడ్డు మీద ధూళి, దుమ్ము రాకుండా కర్టెన్లు కట్టుకుంటున్నారు. వర్షం పడినప్పుడు కిటికిలోంచి జల్లులు ఆఫీసులోని ఫైల్స్ తడిసి పోతున్నాయి. గదుల్లో నీరు వస్తుండడంతో సిబ్బంది ఎత్తిపోయాల్సి వస్తోంది. మరుగుదొడ్లు డోర్లు సీడీపీవో, కార్యాలయ ఉద్యోగులు వేయించారు. భవనంలో ఫ్లంబింగ్ పనులు పూర్తికాకపోవడంతో శ్లాబ్ మీద నీరు నిలిచిపోతున్నది. అంగన్‌వాడీ సిబ్బందికి మీటింగ్ హాల్ లేక ఇబ్బంది పడుతున్నారు. ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం మండలాలలో 169 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో మీటింగ్ పెట్టాలంటే ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదు. అత్యవసరంగా సమావేశ మందిరం నిర్మాణం పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ ఆపేసిన పనులు తక్షణమే పూర్తి చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ ఐసీడీఎస్ కార్యాలయ పరిస్థితిని పీడీ అనంతలక్ష్మిని వివరణ కోరగా.. భవనం అసంపూర్తిగా ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.



కిటికిలకు రెక్కలు లేకపోవడంతో కట్టిన కర్టెన్లు

వామపక్ష నాయకుల నిరసన

- సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం రాష్ట్రానికి ఉండాలని డిమాండ్



నెహ్రూచౌక్ వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 13: రాష్ట్రంలోని తూర్పుగోదావరి, కృష్ణా జిల్లా తీర ప్రాంతాల్లో వెలికితీస్తున్న సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం ఆంధ్రప్రదేశ్‌కు ఉండాలని, వచ్చే ఆదాయంలో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కాకినాడకు 30 కిలో మీటర్ల దూరంలో సముద్ర గర్భం నుంచి 2024 జనవరి ఏడో తేదీ నుంచి ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, కృష్ణా, గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు విలువలు లక్షల కోట్లకు మించి ఉంటాయన్నారు. సహజ వనరులను దేశ సంక్షేమానికి ఉపయోగించే అంశంపై తమకు అభ్యంతరం లేదని, అయితే రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సహజ వనరులను ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో దేశమే కాకుండా ఆయా రాష్ట్రాల సైతం తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు గణేశ్, పీఎస్ అజయ్‌కుమార్, ఐఆర్ గంగాధర్, జి.కోటేశ్వరరావు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, కోరిబిల్లి శంకరరావు, వియ్యపురాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

» వైద్యవిధాన పరిషత్ జేసీ రమేశ్ కిశోర్



వార్డులో పర్యటిస్తున్న వైద్యవిధాన పరిషత్ జేసీ రమేశ్ కిశోర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: రోగులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యవిధాన పరిషత్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించారు. వార్డులను పరిశీలించి బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను బాలింతలకు అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిటీ స్కాన్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అవసరమయ్యే సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆస్పత్రుల్లో గైనిక్ వైద్యుల సంఖ్య పెంచామని చెప్పారు. వైద్యులు తాము పనిచేస్తున్న ప్రధాన కేంద్రాల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఆస్పత్రి అయిన ఎన్టీఆర్ వైద్యాలయానికి మెడిసిన్ బడ్జెట్ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోగులకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచినందున నాణ్యతమైన ఆహారాన్ని అందించాలని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఎంవో గౌతమ్ ఉన్నారు.

తంగలాన్ చిత్రం ఆదరించాలి

» సినీ హీరో విక్రమ్

» విశాఖలో సందడి చేసిన యూనిట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరోయిన్ మాళవిక మోహనన్, హీరో విక్రమ్

విశాఖపట్నం (సాగర్‌నగర్), ఆగస్టు 13: తంగలాన్ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు అఖండ విజయం అందించాలని సినీ హీరో విక్రమ్ అన్నారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజాతో కలిసి మంగళవారం రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ.. ఈ చిత్రం నిర్మాణ సమయంలో యూనిట్ ఎంతో శ్రమించినట్టు చెప్పారు. మేకప్ కోసం గంటల సమయం వెచ్చించాల్సి వచ్చేదన్నారు. కఠినతరమైన పాత్రలు పోషించడం, అడ్వంచర్స్ సృష్టించడం అంటే తనకు ఇష్టమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. ఈ చిత్రం ఈనెల 15వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారం చేసుకుని ఈ చిత్రం తెరకెక్కించామన్నారు. విశాఖ ప్రకృతి అందాలకు నిలయమన్నారు. తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నామన్నారు. 2022లో ప్రారంభమైన ఈ చిత్ర నిర్మాణం చెన్నై, హైదరాబాద్, మధురై, కర్ణాటక సహా పలు లొకేషన్లలో చిత్రీకరించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలై ఇప్పటికే అలరిస్తోందన్నారు. ఈ పాన్ ఇండియా సినిమాని రంజిత్ తెరకెక్కించారు. నీలం ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. సంగీతం జి.వి. ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం ఎ.కిశోర్‌కుమార్ సమకూర్చారు. చిత్రంలో విక్రమ్ డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. కథానాయిక మాళవిక మోహనన్, మరో నటుడు డానియల్ చిత్రానికి సంబంధించి వారి అనుభవాలను పంచుకున్నారు.

వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

» జూనియర్‌వైద్యుల డిమాండ్

» కోల్‌కతా అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట, ఆగస్టు 13: మహిళా వైద్యులకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై వ్యతిరేకంగా ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం కేజీహెచ్‌లో తమ విధులను బహిష్కరించారు. అనంతరం వైద్య కళాశాలనుంచి జగదాంబ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ హత్యాచార ఘటనలో మృతి చెందిన బాధితురాలు ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలందించేందుకు 36 గంటల పాటు విధుల్లో ఉన్నారన్నారు. ఈ సమయంలో ఆమెపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడటం అత్యం త దారుణమని విచారకరమని అన్నారు. ఇలాంటి ఘటన జరగటం దేశానికే సిగ్గు చేటని అన్నారు. ప్రజల వైద్య సేవల్లో మహిళలే ముందుంటున్నారని, వైద్య విద్యలో అధిక శాతం సీట్లు వారే దక్కించుకుంటున్నట్టు వివరించారు. ఈ నేపథ్యం వైద్య సేవలకు రాత్రి సమయంలో ఎక్కడకైనా వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చి వైద్యులకు భద్రత కల్పించాల ని డిమాండ్ చేశారు. విద్యార్థిని హత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాల న్నారు. వైద్యులకు రక్షణ కల్పించడంతోపాటు తమ సమస్యలను పరిష్క రించే వరకు అత్యవసర సేవలు మిన హా మిగిలిన సేవలను బహిష్కరిస్తూ నిరవధిక సమ్మె చేయనున్నట్టు జూని యర్ వైద్యులు ప్రక టించారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

బంగారమ్మతల్లి సన్నిధిలో హోం మంత్రి అనిత



బంగారమ్మతల్లిని దర్శించుకుంటున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, ఆగస్టు 13: మండలంలోని రేవుపోలవరం గ్రామంలో ఉన్న బంగారమ్మతల్లిని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ముందు ఇక్కడి అమ్మవారికి మొక్కుకున్న నేపథ్యంలో మొక్కును చెల్లించడంలో భాగంగా బంగారమ్మతల్లి అమ్మవారి ఆలయానికి వచ్చిన అనిత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మవారికి మొక్కు చెల్లించారు. అంతకు ముందు తమ గ్రామానికి వచ్చిన హోం మంత్రి అనితకు స్థానిక టీడీపీ నేతలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు ఘనస్వాగతం పలికారు. స్థానిక నాయకులు, గ్రామస్థులు కలిసి బంగారమ్మతల్లి చిత్రపటాన్ని ఆమెకు బహూకరించారు. ఆలయానికి వచ్చిన మహిళలను అనిత ఆప్యాయంగా పలకరించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక టీడీపీ నేతలు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, కోడ లోవరాజు, కె.బంగారి, అడవి రాజు, అప్పన్న, జోగారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జోగి రమేశ్ అక్రమాలు బట్టబయలు

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



అనకాపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలబడతామని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన జోగి రమేశ్ అధికార దుర్వినియోగానికి పాల్పడి చేసిన అక్రమాలు బయటకు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మంగళవారం ఆయన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన కుటుంబ సభ్యుల అక్రమాలు, అధికార దుర్వినియోగంపై ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా జోగి రమేశ్ రౌడీలను వెంటబెట్టుకొని ఉండవల్లిలో చంద్రబాబు ఇంటి మీదకు వచ్చి నానా యాగీ చేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. నకిలీ సర్వే నంబర్లతో అగ్రిగోల్డ్ భూములను కాజేశారని, అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు విచారణ జరిపి జోగి రాజును అరెస్టు చేశారని, ఇందులో ఎటువంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలు లేవన్నారు.

'దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదు'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13: రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ దరఖాస్తుదారునికి గడువులోగా పూర్తి సమాచారాన్ని ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం పట్ల రాష్ట్ర సమాచార కమిషనర్ మహబూబ్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆర్‌టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ 2019 ఏప్రిల్ ఒకటి నుంచి సమాచారం ఇచ్చే తేదీ వరకు జారీ చేసిన ప్రకటనలు, ప్రసార మాధ్యమాల పేర్లు, ప్రకటనల విలువ, ఆర్‌వోలు, చెల్లింపులు, బకాయిల వివరాలు, ప్రసార మాధ్యమాలు ఎంపానల్‌మెంట్ నియమావళి కోసం 2022 నవంబరు 16వ తేదీన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖకు దరఖాస్తు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను వెంకటరమణ ఆశ్రయించారు. మంగళవారం వర్చువల్ విధానంలో విచారణ నిర్వహించారు. దరఖాస్తుదారుడు కోరిన పూర్తి సమాచారాన్ని వచ్చే నెల 19వ తేదీలోగా అందజేయాలని స్పష్టం చేశారు.

పెన్షన్లకు దరఖాస్తు చేయండి

» మహిళలకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచన



మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్, డీఆర్‌డీఏ వితంతు పింఛన్లపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలనుకున్న వారు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటును సంప్రదించాలని సూచించారు. సచివాలయానికి వెళితే ఎలా దరఖాస్తు చేయాలో తెలియజేస్తారన్నారు. ఏదైనా కారణంతో సచివాలయంలో తమ పనికాకుంటే ఐటీడీఏ కార్యాలయానికి రావాలన్నారు. అలాగే బియ్యం కార్డులో భర్త పేరు ఉంటే పింఛను మంజూరు చేయడం జరగదని, భర్త మృతి చెంది ఉంటే రేషన్ కార్డులో పేరు తొలగించాలన్నారు. అలాగే మండల కేంద్రాల్లో వారపు సంత రోజున పింఛన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక రోజు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐటీడీఏ పీవో సూచించారు. అనంతరం వెలుగు ఆధ్వర్యం నిర్వహిస్తున్న విస్తర్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పులను స్థానిక హోటళ్లకు సరఫరా చేయాలని పీవో సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వి.మురళీ, ఎంపీడీవో సాయినవీన్, ఈవోపీఆర్‌డీ రమేశ్, లీగల్ అడ్వయిజర్లు టి.ప్రసాద్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

బ్రహ్మపూర్ రైలు శ్రీకాకుళంరోడ్డు వరకే..

విశాఖపట్నం, ఆగస్టు 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, బ్రహ్మపూర్ నడిచే రైలు సర్వీసుల గమ్యాన్ని కుదించామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 08532 నంబరు గల రైలు ఈనెల 18న విశాఖ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు, తిరుగు ప్రయాణంలోని బ్రహ్మపూర్ నుంచి విశాఖ వచ్చే 08533 నంబరు గల రైలు ఈనెల 19న శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ నుంచి బయలుదేరి విశాఖ చేరుతుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం రోడ్డు, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసామన్నారు.

హోంమంత్రిని కలిసిన ప్రగడ


హోంమంత్రితో మాట్లాడుతున్న ప్రగడ

ఎస్.రాయవరం/ యలమంచిలి ఆగస్టు 13 : ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఎలమంచిలి మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నేత కర్రి శివ శంకర్ గణేశ్వరావు మంగళవారం అడ్డరోడ్డులో రాష్ట్ర హోంమంత్రి వంగపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గం అభివృద్ధి, పలు ప్రజా సమస్యల ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరినట్టు చెప్పారు.

చిరంజీవి జన్మదిన వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, ఆగస్టు 13 : మెగాస్టార్ చిరంజీవి69వ జన్మదినం వేడుకలను పురస్కరించుకుని లంకెలపాలెం చిరంజీవి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించనున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి 22 వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 22న లంకెలపాలెం జంక్షన్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ వారోత్సవాల్లో చిరంజీవి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మడక రమేష్‌నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కె.వాసుదేవరావు, బంతికోరు గోవిందరాజు, శ్రీనివాసకుమార్, పెంటారావు, ఎం.శ్రీనివాసరావు, గొల్లవిల్లి నానాజీ, బొండా అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్మికులతో కలిసి ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుంటే విధులు బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు బకాయి పడిన జీతాలు తక్షణమే చెల్లించాలని, ప్రతీ నెలా ఏడో తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రతి ఏటా రెండు జతల యూనిఫారం ఇవ్వాలని కోరారు. అలాగే కార్మికులకు రెస్ట్‌రూము సౌకర్యం కల్పించాలని, మూడు షిఫ్ట్‌ల పని విధానం రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలన్నారు. పనిభారానికి తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, సంతోష్, రాజ్యలక్ష్మి, దుర్గ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో 'పొలంబడి'


అవగాహన కల్పిస్తున్న జ్యోతిమోహన్

కొత్తూరు, ఆగస్టు 13 : అనకాపల్లి మండలం సీతానగరంలో మంగళవారం పొలంబడిని నిర్వహించి వరి కాండంతో వచ్చే పురుగు నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకుడు జ్యోతిమోహన్ రైతులకు పలు సూచనలు అందించారు. వరి నారు కొనలను తుంచి నాటుకోవడం ద్వారా వరి కాండంతో వచ్చే పురుగులను నివారించవచ్చున్నారు. వరి నాట్లు వేసేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున విడిచిపెట్టడం వల్ల పంటలకు గాలి, వెలుతురు బాగా ప్రసారం జరిగి చీడిపీడల నివారణతో పాటు సస్యరక్షణ చర్యలకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

» మత్స్యకార నాయకుడు మేరుగు రాజుబాబు డిమాండ్


ఆర్టీఐ పిటీషన్ వేసి రికార్డులు తనిఖీ చేస్తున్న రాజుబాబు

అచ్యుతాపురం, ఆగస్టు 13 : మాజీ ఎమ్మెల్యే యూవీ రమణ మూర్తి రాజు (కన్నబాబు రాజు) అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పూడిమడకకు చెందిన మత్స్యకార నాయకుడు మేరుగు రాజుబాబు డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా కొండకర్ల సచివాలయంలో మంగళవారం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. కొండకర్ల ఆవ వద్ద కన్నబాబు రాజు గెస్ట్‌హౌస్ నిర్మించారు. ఇందులో ప్రభుత్వ భూమి ఉందని తెలియటంతో రాజుబాబు ఆర్టీఐ కింద అర్జీ పెట్టారు. ఈ నేపథ్యంలో అధికారుల సమక్షంలో మంగళవారం రికార్డులు తనిఖీ చేయగా, కొండకర్ల సర్వే నంబరు 227/1లో 55సెంట్ల ప్రభుత్వ భూమిని కన్వర్షన్ చేసి భవన నిర్మాణానికి అనుమతులు పొందారని ఆయన తెలిపారు. దీనిపై ఎన్‌డీఏ కూటమి ప్రజాప్రతినిధులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పూడిమడక సర్వే నంబర్లు 51 నుంచి 56 వరకు గల సుమారు 40 ఎకరాల భూమి రికార్డుల్లో గయాలు (ప్రభుత్వ భూమి)గా నమోదై ఉంది. దీనిని కన్నబాబు తన అధికారంతో జిరాయితీగా మార్పించి స్వాహా చేశారు. దీనిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

ఆంజనేయుడికి పూజలు

రాంబిల్లి, ఆగస్టు 13 : మండలంలోని సంతపాలెంలో కొలువైయున్న శ్రీఅభయాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

1,800 హెక్టార్లలో వరినాట్లు

» సాధారణం విస్తీర్ణం 2,765 హెక్టార్లు
» కొద్ది రోజుల్లో వంద శాతం నాట్లు
» ఈ పంట నమోదు తప్పనిసరి
» ఏవో ఆదినారాయణ


నామవరంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ పి.ఆదినారాయణ

పాయకరావుపేట, ఆగస్టు 13 : పాయకరావుపేట మండలంలో ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడడంతో ఖరీఫ్‌లో రైతులు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. పాయకరావుపేట వద్ద తాండవ నదిలోకి కొద్ది వారాలుగా వర్షపునీరు చేరుతుండడంతో మురా, భూమి కాలువల్లో పారుతున్న నీటితోపాటు బోర్ల సదుపాయం ఉన్న చోట్ల నాట్లు పడుతున్నాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ పాయకరావుపేట మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట సాధారణ విస్తీర్ణం 2,765 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకూ 1,800 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయని, ఈనెలాఖరు నాటికి సాధారణ విస్తీర్ణం వంత శాతం పూర్తవుతుందని తెలిపారు. మండలంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 365 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశామని, ఇంకా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ పంటలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం పొందాలన్నా రైతులు తాము వేసిన పంటను ఈ-పంట ద్వారా నమోదు చేసుకోవడం తప్పనిసరని ఏవో స్పష్టం చేశారు. ఈ-పంట నమోదైతేనే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు వేసిన రైతులు రైతు సంక్షేమ కేంద్రాల సిబ్బందిని సంప్రదించి వెంటనే ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయులకు హోంమంత్రి సన్మానం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హోంమంత్రి అనిత

ఎస్.రాయవరం, ఆగస్టు 13 : మండలంలోని రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గత 2023-24 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో ఆయా సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, జగన్‌లను మంగళవారం ఆ పాఠశాలకు వెళ్లిన హోంమంత్రి వంగలపూడి అనిత అభినందించి సన్మానించారు. ఆ గ్రామంలో గల బంగారమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లిన హోం మంత్రి అనిత అందులో భాగంగా అక్కడ పక్కనే ఉన్న పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పిల్లా శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హోం మంత్రి అనితకు చెక్ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమరావతి కోసం రూ.30 వేల విరాళం


ఎస్.రాయవరం, ఆగస్టు 13 : అమరావతి రాజధానికి అనకాపల్లి పట్టణానికి చెందిన చిల్డ్రన్స్ ఫిల్మ్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.30,000 విరాళంగా అందజేశారు. అసోసియేషన్ సెక్రటరీ చలమల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ యూవీ సంతోష్, సెక్రటరీలు మంగళవారం రాష్ట్ర హోంమంత్రి అనితను కలిసి ఈ విరాళాన్ని అందజేశారు. ఈ విరాళంతో పాటు తిరుపతిలో సాకం కృష్ణమూర్తి అనే వ్యక్తి నిర్వహిస్తున్న అనాథాశ్రమం రియల్స్ సొసైటీకి 200 దుప్పట్లు హోంమంత్రి సమక్షంలో అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ తాకసి కిషోర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ఆర్థిక ప్రయోజనాలు


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ

కోటవురట్ల, ఆగస్టు 13 : సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి ఆర్థిక వనరులను సమాకూర్చుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. మంగళవారం కోటవురట్ల మండలం లింగాపురం సచివాలయాన్ని ఆమె సందర్శించారు. సచివాలయంలో రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం లింగాపురంలో గల తడి, పొడి సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీ కంపోస్టు తయారీ ద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని కార్యదర్శి అనంతలక్ష్మికి ఆమె సూచించారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డీ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

15 వందల మొక్కలు నాటేందుకు ప్రణాళిక


సిద్ధం చేసిన మొక్కలు

ఎలమంచిలి, ఆగస్టు 13 : కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు గ్రామాల్లో 'అమ్మ పేరున ఒక్క మొక్క నాటుదాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టినట్టు ఎంపీడీవో కొండబాబు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 17 గ్రామాల్లో సుమారు 15 వందల మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. గ్రామాల్లోని చెరువు గట్లు, శ్మశాన వాటికలు గ్రామ స్థాయిలోని ఖాళీ ప్రదేశాల్లో ఈ మొక్కలు నాటనున్నట్టు చెప్పారు.

80వ వార్డులో కూటమి నేతల పర్యటన


డ్రైనేజీని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 : స్థానిక 80వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షులు బీఎస్ఎంకే జోగినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం కూటమి నాయకులు వార్డులో పర్యటించారు. చినరామస్వామి కోవెల నుంచి కాంచెట్టు వరకు దెబ్బతిన్న కల్వర్టు, రోడ్డును పరిశీలించారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డుల్లో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మారిశెట్టి భాస్కరరావు, కూటమి నాయకులు విల్లూరి రమణబాబు, బొడ్డేడ మురళీ, కర్రి మల్లేశ్వరరావు, దూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా'తో జాతీయ స్ఫూర్తి చాటుదాం

» వక్తల పిలుపు


జెండా ఆవిష్కరించిన కూటమి నాయకులు


అచ్యుతాపురం : మాట్లాడుతున్న సన్యాసినాయుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని 80వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు పిలుపునిచ్చారు. 80వ వార్డు కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ మూడు రోజులు ప్రతి ఇంటిపై భారతదేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా ప్రతి ఒక్కరూ ఇంటి పైన జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జండా ఎగురవేయాలని బీజేపీ రాంబిల్లి మండల అధ్యక్షులు కారే రాముడు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం రాంబిల్లి బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా మహోత్సవంలో భాగంగా ప్రతి భారతీయుడు కుల,మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటిపై జాతీయ జండాను ఎగురువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నేత ధర్మాల వరహాగోవిందరెడ్డి, జిల్లా నేత నాగమంత్రి శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమేశు, బీజేపీ మండల మాజీ అధ్యక్షులు ఉమ్మిడి వెంకటేశ్వర్లు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సూరాడ ధర్మతేజ, మాజీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సూరాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


రాంబిల్లి : మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు రాముడు

అచ్యుతాపురం : ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగరాలని బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గం కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టి జాతీయ స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, కూండ్రపు నాయుడు బాబు, మేరుగు కాసు బాబు, రాజాన రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ విలువలకు కట్టుబడే!

... 5వ పేజీ తరువాయి

తీసుకుని ఎమ్మెల్సీ స్థానం గెలుచుకుని సాధించేదేమీ లేదన్నారు. అయితే జిల్లాలో కూటమికి మెజారిటీ లేదనో, విజయం సాధించలేమనే భయంతోనో తీసుకున్న నిర్ణయం కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా సాగాలనే ఉద్దేశంతోనే బరి నుంచి తప్పుకున్నట్టు పల్లా వివరించారు.

ముగిసిన నామినేషన్ల గడువు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది.

కూటమి నుంచి ఎవరినీ పోటీకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయలేదు.

వైసీపీ తరపున బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా మరో వ్యక్తి సోమవారం సమర్పించిన నామినేషన్లే మిగిలాయి. వీటిని బుధవారం పరిశీలిస్తారు.

రాజుగారిబీడులో అంధకారం

పాయకరావుపేట, ఆగస్టు 13 : పట్టణంలోని రాజుగారి బీడులోని పలు వీధుల్లో వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. ముఖ్యంగా సందప్ప చెరువు నుంచి శ్మశానం వరకు వెళ్ళే రహదారిలో పలుచోట్ల వీధిలైట్లు మరమ్మతులకు గురై గత రెండు నెలలుగా వెలగకపోవడంతో ప్రజలు రాత్రిపూట చీకట్లో రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు చీకటిపడితే వాహనదారులు, నడిచి వచ్చేవారిని కుక్కలు వెంటాడుతుండడంతో రాత్రిపూట ఒంటరిగా బయటకు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు.

ఆధునిక సస్యరక్షణతో అధిక దిగుబడులు


సత్యవరంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 13 : ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని పాయకరావుపేట డివిజన్ వ్యవసాయశాఖ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని సత్యవరంలో తాండవ వాలీ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇండి గ్యాప్ పద్ధతులను పాటిస్తూ పండించే పంటలకు తక్కువ ఖర్చు కావడంతో పాటు నాణ్యత గల పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. తాండవ వాలీ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా పండించిన వరి పంటను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం సీనియర్ రిసోర్స్ పర్సన్ చిరంజీవి మాట్లాడుతూ ఇండి గ్యాప్ ప్రోగ్రాం ద్వారా వరి పంటను సాగు చేయడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణతో పాటు రైతు సంక్షేమ కేంద్రం సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

పేదలకు వైద్యం దూరం

» సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్యాన్ని దూరం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రులన్నింటిని ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని చెప్పడం అవివేకమన్నారు. ఇప్పటికై ప్రభుత్వా స్పత్రుల నిర్వహణ బాగా లేదని, ఇప్పుడు ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పిస్తే వ్యాపార దృక్పథం అయిపోతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీజనల్ వ్యాధులు కారణంగా రక్తపరీక్షలు చేయడానికి పరీక్షా కిట్లు లేని దుస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా ప్రైవేటుకు అప్పగిస్తే ఫలితాలు బాగుంటాయనే విధంగా ప్రచారం చేస్తుండడం తగదన్నారు. వైద్యం కోసం వ్యయప్రయాసలకు భరించే స్థితిలో పేదలు ఉండరన్నారు. వైద్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలు ప్రభుత్వాలే తీర్చాలన్నారు. ఆస్పత్రుల నిర్వహణ పీపీపీకి అప్పగించాలన్న ఆలోచన ఏ మాత్రం సరికాదన్నారు.

మండల సమావేశం వాయిదా

మునగపాక, ఆగస్టు 13 : మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. అధిక శాతం మంది ఎంపీటీసీ సభ్యుల గైర్హాజరుతో కోరం సరిపోక సభ వాయిదా వేశారు. వైసీపీకి చెందిన 11 మంది ఎంపీటీసీ సభ్యులు సభను బహిష్కరించడంతో అధికారులు ఈ సమావేశాన్ని వాయిదా వేశారు.

జనసేనలో చేరిన చిన్నరామస్వామి


కండువా కప్పి పార్టీకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, ఆగస్టు 13 : ఎలమంచిలి మండలంలోని పీఎస్‌ఆర్ పేట మాజీ సర్పంచ్ ఊటకూటి చిన్న రామస్వామి తన అనుయాయులతో వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం ఆయన అచ్యుతాపురం లోని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ కార్యాలయంలో పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి విజయకుమార్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజాన శేషు, పెట్ల శ్రీనివాసరావు, నగిరెడ్డి అచ్చంనాయుడు, గోపిశెట్టి రాజు, బొద్దపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఆగస్టు 13 : మండలంలోని పురుషోత్తపురం, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పీఎస్‌ఆర్ పేట, పేరంటాలపాలెం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ చేపడుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆపరేషన్స్ కె.రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్నచోట ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ వ్యవసాయవిద్యుత్ కనెక్షన్లకు సరఫరా ఉంటుందని తెలిపారు. పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం, పీఎస్‌ఆర్ పేట, షైహోమ్ సిమెంటు పరిశ్రమ, లక్కవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల, ఆగస్టు 13 : స్వాతంత్రం దినోత్సవం నేపథ్యంలో మంగళవారం కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటల పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రసీద పరిశ్రమ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్


రహదారిపై పారుతున్న పరిశ్రమ నుంచి వెలువడే వృథా నీరు

పరవాడ, ఆగస్టు 13 : పరవాడ మండల పరిషత్ జంక్షన్ నుంచి ఫార్మాసిటీ మీదుగా లంకెలపాలేనికి వెళ్లే ప్రధాన రహదారిలోని శ్రీప్రశీద స్టీల్ అండ్ మినరల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నుంచి వచ్చే నీరు రహదారిపైకి వచ్చి నిల్వ ఉండడంతో ఆ ప్రాంతమంతా గొయ్యిగా ఏర్పడింది. ఇందుకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమ లోపల నుంచి డ్రైన్ ద్వారా రహదారి మీదకి నీరు వచ్చి నిల్వ ఉండడం వల్ల ఆ ప్రాంతమంతా బురదగా తయారవడంతో పాటు పెద్ద రంధ్రం ఏర్పడిందన్నారు. దీనివల్ల అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీరు నిల్వ వల్ల రహదారి కూడా దెబ్బతింటుందన్నారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు తక్షణమే కలుగజేసుకుని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నర్సీపట్నం నియోజకవర్గం

నాతవరానికి 25 గోకుల షెడ్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనువాసు

నాతవరం, ఆగస్టు 13 : నాతవరం మండలానికి 25 గోకులం షెడ్లు మంజూరైనట్టు పాయకరావుపేట పశుసంవర్ధకశాఖ సహయ సంచలకులు శ్రీనువాసు పేర్కొన్నారు. మంగళవారం నాతవరంలో పశువైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్లను పాడిరైతులు వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ షెడ్ల ఏర్పాటుకు 90 శాతం, గొర్రెల షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. పశువులకు వ్యాధులు రాకుండా ఈ నెల 20 నుంచి వచ్చే 20 వరకు టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కృత్రిమ గర్భధారణ, గడ్డి విత్తనాల సరాఫరా తదితర విషయాలపై రైతులకు వివరించారు. అలాగే నాతవరం పశువైద్య కేంద్రానికి పి.నరేష్ నూతన పశువైద్యుడిగా బాధ్యతలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువుల వైద్యులు గునుపూడి మోక్షరెడ్డి, హరిత,గోపాలమిత్ర సభ్యులు సిబ్బంది ఎ.అబి, గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ కన్నుమూత

మాకవరపాలెం, ఆగస్టు 13 : మండల కేంద్రానికి చెందిన వైసీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ చింతకాలయ శ్రీనివాస్ (50) అకాల మరణం చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ పార్టీ తరుపున మాకవరపాలెంలో ఎంపీటీసీగా గెలుపొంది మండల పరిషత్ ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడంతో వైసీపీలో చేరి మాకవరపాలెంలో సీనియర్ నాయకుడుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మరణించారు. ఈయన మృతికి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సానుభూతి ప్రకటించారు.



శ్రీనివాస్ (ఫైల్)

భీతి గొల్పుతున్న వీధి కుక్కలు

- గుంపులుగా సంచరిస్తూ మనిషి కనిపిస్తే మూకుమ్మడి దాడి
- ఒంటరిగా వెళ్లాలంటేనే భయంతో వణుకుతున్న జనం
- పిల్లలు, వృద్ధులపై విరుచుకుపడుతున్న వైనం
- ద్విచక్రవాహనాల వెంట పడి మరీ అటాక్



వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నర్సీపట్నం, ఆగస్టు 13 : నర్సీపట్నంమునిసిపాలిటీతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. కుక్కలు గుంపులుగుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ఎవరు కనిపిస్తే వారిని కరుస్తున్నాయి. దీంతో రోడ్డు మీదకు రావాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా స్కూల్ విద్యార్థులు, చిన్న పిల్లలు అధికంగా కరుస్తున్నాయి. కుక్కలు కరవడం వలన రేబీస్ వంటి భయంకర వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వాటి సంతతి పెరగకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన మునిసిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కుక్కలను చంపితే కొందరు సామాజిక సేవకులు వేసే కేసుల్లో ఇరుక్కుంటామని కారణం చూపించి తప్పించుకుంటున్నారు. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి మార్గం చూపడం లేదని బాధితులు విమర్శిస్తున్నారు. కుక్క కాటుతో ఏరియా ఆస్పత్రి ఓపీ విభాగానికి వచ్చిన బాధితులు ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో 159 మంది, మే నెలలో 143, జూన్ నెలలో 138 మంది ఉన్నాయంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేసుకోవచ్చు.

మునిసిపాలిటీలో అధికంగా బాధితులు

బలిఘట్టంలో సుర్ల యశ్వంత్ అనే పదకుండేళ్ల బాలుడిని కుక్క కరిచి తీవ్రంగా గాయపరిచింది. రామారావుపేటకు చెందిన పద్నాలుగేళ్ల బాలుడు నల్లబిల్లి సందీప్, నర్సీపట్నంకు చెందిన పదిహేనేళ్ల బాలిక నేతల తేజస్విని కుక్కలు దాడి చేసి గాయ పరిచాయి. కొత్తవీధికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక మానేపల్లి శృతికను కుక్క కరడంవతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. గత నెల ఐదో తేదీన బలిఘట్టంకి చెందిన ఐదేళ్ల బాలుడు గవిరెడ్డి రియాన్షని పక్కింట్లో పెంపుడు కుక్క కరవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జూన్ నెలలో మునిసిపాలిటీలో నర్సీపట్నంకు చెందిన కొప్పుల రత్నం, బలిఘట్టంకి చెందిన శెట్టి మధు, నర్సీపట్నంకి చెందిన మలిపెద్ది రాజేశ్వరి, పెదబొడ్డేపల్లికి చెందిన మస్తాన్, గచ్చపువీధికి చెందిన చీపురపల్లి సతీష్‌లను వీధి కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయ పడ్డారు.

పెరుగుతున్న కుక్కల సంతతి

పురపాలక సంఘంలో వీధి కుక్కల సంతతి రోజు రోజుకూ పెరిగి పోతోంది. పశు సంవర్ధకశాఖ, మునిసిపల్ అధికారులు వీధి కుక్కల నియంత్రణలకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆడ, మగ కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయడం వలన కుక్కల నివారణ సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఆటల పోటీలు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 13 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 21 మంది దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యం, మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు రన్నింగ్, చైర్ ఆటలు, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించినట్లు స్థానిక హెచ్ఎం నాగభూషణం, ప్రత్యేక ఉపాధ్యాయుడు మాణిక్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో తేలికపాటి వర్షం



కురుస్తున్న వర్షం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 13 : గొలుగొండ మండలంలో గల ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో మంగళవారం మోస్తరు వర్షం పడింది. దీంతో మూడు రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు కొంతమేరకు ఉపశమనం కలిగింది. ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది కురిసిన వర్షాలకు రబీ, ఖరీఫ్ వరిసాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. వర్షం కారణంగా వీధుల్లో రోడ్లు బురదమయంగా మారాయి.

జాతీయవాదాన్ని పెంపొందించాలి



హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నేత సతీశ్, విద్యార్థులు

నాతవరం, ఆగస్టు 13 : యువకులు, విద్యార్థులు జాతీయభావాన్ని పెంపొందించుకోవాలని బీజేవైఎం రాష్ట్ర నాయకులు అడిగర్ల సతీశ్ పేర్కొన్నారు. మంగళవారం నాతవరంలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ దేశం కోసం పోరాటం చేసి వీరమరణం చెందిన స్వాతంత్ర్య సమారయోధులు, ఆర్మీ జవాన్ల ప్రాణత్యాగాలు మరవలేనివని పేర్కొన్నారు. వారి ఆశయ సాధనకోసం యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాకిరెడ్డి రవి, ఎల్.విక్రమ్ పోలుపర్తి శ్రీనువాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించాలి



శిథిలమైన జూనియర్ కళాశాల భవనం

మాకవరపాలెం, ఆగస్టు 13 : మండల కేంద్రంమైన మాకవరపాలెంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉన్న శిథిల భవనాన్ని తొలగించాలని కాలేజీ విద్యార్థులు కోరుతున్నారు. గత కొన్ని రోజులు క్రితం కాలేజీలో ఉన్న ఈ శిథిల భవనం ముందుభాగం పూర్తిగా కూలిపోయింది. కాలేజీ మధ్యలో ఈ శిథిల భవనం కూలిపోవడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే వర్షాలు కురుస్తుడడంతో ఈ భవనం కాస్త రోజూరోజూకూ మరింతగా కూలుతోందని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా కూల్చివేసి భవన సామగ్రిని బయటకు తరలించాలని కోరుతున్నారు.

లింగంపేటలో తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీతో రోడ్డుపైకి వస్తున్న నీరు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 13 : లింగంపేటలో లైప్‌లైన్ లీకేజీతో ప్రధాన రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. లింగంపేటలో రూ.11 కోట్లతో నిర్మించిన భారీ మంచినీటి పథకం ద్వారా సుమారు 20 గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. ఇప్పుడే లీకేజీ ఏర్పడటంతో గత రెండు రోజులుగా వందలాది లీటర్ల తాగునీరు రోడ్డుపై పారుతోంది. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రాజకీయ విలువలకు కట్టుబడే!

... 5వ పేజీ తరువాయి

తీసుకుని ఎమ్మెల్సీ స్థానం గెలుచుకుని సాధించేదేమీ లేదన్నారు. అయితే జిల్లాలో కూటమికి మెజారిటీ లేదనో, విజయం సాధించలేమనే భయంతోనో తీసుకున్న నిర్ణయం కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా సాగాలనే ఉద్దేశంతోనే బరి నుంచి తప్పుకున్నట్టు పల్లా వివరించారు.

ముగిసిన నామినేషన్ల గడువు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. కూటమి నుంచి ఎవరినీ పోటీకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయలేదు. వైసీపీ తరపున బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా మరో వ్యక్తి సోమవారం సమర్పించిన నామినేషన్లే మిగిలాయి. వీటిని బుధవారం పరిశీలిస్తారు.

చోడవరం నియోజకవర్గం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చోడవరం, ఆగస్టు 13: పట్టణంలోని ప్రేమసమాజం ఆవరణలో స్వాతంత్ర్య పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రేమసమాజం ఇన్‌చార్జి ప్రసాదరాజు, ఆర్క్ సంస్థ డైరెక్టర్ డీఎస్ ప్రసాద్, రిటైర్డ్ ఎంఈవో సత్యం ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలను ఈ నెల15 న బహుమతులు ప్రదానం చేస్తారు. పోటీల్లో వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు నిధులపై హర్షం

చోడవరం, ఆగస్టు 13: రాష్ట్రంలో ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ప్రైవేటు ఆలయాలకు నెలకు రూ.10 వేలు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ కోఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆలయాల అర్చకులు ఎంతో నిరాదరణకు గురయ్యారని, కూటమి అధికారంలోనికి వచ్చిన రెండు నెలల్లోనే ప్రైవేటు ఆలయాలకు సైతం నెలకు రూ.10 వేలు ఇవ్వనున్నట్టు సీఎం ప్రకటించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ పథకం కింద సాయం పొందడానికి ప్రైవేటు ఆలయాల అర్చకులు తమ వివరాలు దేవదాయ శాఖ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సీఎం తాజా నిర్ణయంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని 27,872 ఆలయాలు, ప్రైవేటు ఆధ్వర్యంలో ఎనిమిది వేలు ఆలయాలు బాగుపడడంతో పాటు అర్చకులకు కూడా మేలు చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

జనసేనలోకి వైసీపీ కార్యకర్తలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న రాజు

రోలుగుంట, ఆగస్టు 13: మండలంలోని జగ్గంపేట గ్రామానికి చెందిన పలువరు వైసీపీ కార్యకర్తలు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. వారిని నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ సీనియర్ నేత చెరకాపు సాంభమూర్తి, వార్డు మాజీ సభ్యులు సురేష్‌కుమార్, కిరణ్ జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, నాయకులు లాలం నరసింగరావు, వజ్రపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ సమస్యలపై కళాశాల విద్యార్థుల ఆందోళన



సమస్యలపై నినాదాలు చేస్తున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

చోడవరం, ఆగస్టు 13: పట్టణంలోని గాంధీగ్రామం పరిధిలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలో కళాశాల విద్యార్థులు పీడీఎస్‌వో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్‌లో గదులు వర్షం వస్తే కారిపోతున్నాయని, భవనాలు శిథిలమయ్యాయని, హాస్టల్‌లో అసౌకర్యాల నడుమ చదువుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును కలిసి విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు ఎ.మౌనిక, అఖిల్, పి.రామకృష్ణ, చంటి, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి సోమశేఖర్



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి సోమశేఖర్

కె.కోటపాడు, ఆగస్టు 13: రైతు సేవా కేంద్రంలో రైతులంతా తమ వివరాలను అందజేసి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం గొండుపాలెం గ్రామంలో రెవెన్యూ వ్యవసాయ అధికారులు రైతుల పంట పొలాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ రైతు వ్యవసాయ భూమిలో పంట వివరాలను ఖరీఫ్, రబీల్లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారన్నారు. పొలంలో వేసిన పంటను ఫొటో తీసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు. దీనివల్ల పంట నష్టం, క్రాప్ ఇన్సూరెన్స్, ధాన్యం సేకరణ తదితర పథకాలకు అర్హత సాధిస్తారని చెప్పారు. ఈ పంట నమోదును వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు

చీడికాడ: ఈ పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి ఎం.రమాదేవి చెప్పారు. చీడికాడ పొలాల్లో వ్యవసాయ సిబ్బంది గణేష్‌తో కలిసి మంగళవారం ఈపంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలుకు, పంట పోయినపుడు ప్రభుత్వం నుంచి ఆర్థికి సాయం అందుతుందన్నారు. ఈ విషయంలో రైతులంతా వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.



ఎంఈవోలకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

జీవో 117ను వెంటనే రద్దు చేయాలని వినతి

మాడుగుల, ఆగస్టు 13: గత ప్రభుత్వ హయంలో జారీ చేసిన జీవో నంబర్-117ను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవోలు పాండు రంగారావు, బి.దేముడమ్మలకు వినతిపత్రాలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో 117 ను రద్దుపరిచిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని కోరారు. ఈ సమస్యను జిల్లా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు పి.చంద్రరావు, ఎ.అప్పారావు, కృష్ణ, శివకుమార్, బంగారయ్య, ఆనందరావు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయండి

రోలుగుంట, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.రమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లోనూ గృహాలపై, వ్యాపార కేంద్రాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు డి.రాజేష్, కర్రి తమ్మునాయుడు, మామిడి రమణ, టి.వెంకటరమణ, మడ్డు నారాయణరావు పాల్గొన్నారు.

75 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

మాడుగుల, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మాడుగుల కేంద్రంలో 75 మీటర్ల జాతీయ జెండాను పట్టుకొని పురవీధుల మీదుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగ 75 మీటర్ల పొడవు గల జాతీయ జెండాను తయారు చేసి భారత నిర్మాన సేవాట్రస్టు ఆధ్వర్యంలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ భారత్ మాతాకు జై అనే నినాదాలతో ఈ ర్యాలీ సాగించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణ నెలకొంది. జాతీయ జెండాతో గ్రామంలో ఊరేగింపుగా తిరగడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.సూర్యారావు, ట్రస్టు సభ్యులు ఎం.సతీష్, జె.సుబ్బారావు, సన్యాసయ్యశెట్టి పాల్గొన్నారు.





మాడుగుల నియోజకవర్గం



కుర్చీల ఆటల పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

ఉత్సాహంగా విద్యార్థినులకు ఆటల పోటీలు

కె.కోటపాడు, ఆగస్టు 13: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, కుర్చీ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌వీ పద్మావతి మాట్లాడుతూ విజేతలకు ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిల రక్షిత నీటి ట్యాంకును తొలగించరూ..

దేవరాపల్లి, ఆగస్టు 13: మండలంలోని బి.కింతాడ గాంధీ సెంటర్‌లో ఉన్న రక్షిత పథకం పెచ్చులు ఊడి శిథిలావస్థకు చేరిందని, దీన్ని వెంటనే తొలగించాలని తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి కడిం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినట్టు మంగళవారం ఆయన తెలిపారు. రక్షిత పథకం ట్యాంకు శ్లాబు పెచ్చులు ఊడుతుండడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని భయానక స్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండ కాచే సమయంలో ప్రజలు ట్యాంకు కింద ఉంటూ సేదదీరుతున్నారని, ప్రమాదం జరగక ముందే దాన్ని కూల్చివేయాలని ఆయన కోరారు.

ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ సేవలు ఆదర్శనీయం

దేవరాపల్లి, ఆగస్టు 13: ప్రిన్సిపాల్ చందక రవీంద్రనాథ్ సేవలు ఆదర్శనీయమని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపావతి కొనియాడారు. తెనుగుపూడి అంబేడ్కర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తరుణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాలుగు తరాల ఉమ్మడి కుటుంబ సభ్యుల మధ్య ఉద్యోగ విరమణ పొందడం రవీంద్రనాథ్ అదృష్టమన్నారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఖ్యాతి ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల, ఆగస్టు 13: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆర్‌కే ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

చిరంజీవి జన్మదిన వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ, ఆగస్టు 13 : మెగాస్టార్ చిరంజీవి69వ జన్మదినం వేడుకలను పురస్కరించుకుని లంకెలపాలెం చిరంజీవి అభిమానుల సంఘం ఆధ్వర్యం లో వారం రోజులు పాటు నిర్వహించనున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి 22 వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 22న లంకెలపాలెం జంక్షన్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ వారోత్సవాల్లో చిరంజీవి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.